# ఇండియన్ పాలిటీ

## 73, 74వ రాజ్యాంగ సవరణ చట్టాలు

పాలిటీకి సంబంధించి 73, 74 రాజ్యాంగ సవరణ చట్టాలకు పరీక్షల రీత్యా ప్రాధాన్యం ఉంది. దీంతోపాటు పంచాయతీ సంస్థల్లోని రిజర్వేషన్లు, నిర్మాణం, పదవీకాలాలు, అర్హతలు, అధికారాలు కూడా ముఖ్యమే. 73వ రాజ్యాంగ సవరణ వర్తించని రాష్ట్రాల వివరాలనూ అభ్యర్థులు గుర్తుంచుకోవాలి.

- లక్ష్మీ మాల్ సింఘ్వీ కమిటీ (ఎల్.ఎం. సింఘ్వీ 1986), సర్కారియా కమిషన్‌ల (1987) సూచనల మేరకు రాజీవ్ గాంధీ ప్రభుత్వం 1988లో పి.కె. తుంగన్ నేతృత్వంలో ఒక పార్లమెంటరీ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది.
- ఈ ఉపసంఘం సూచనల మేరకు 1989, మే 15న పంచాయతీరాజ్ వ్యవస్థకు 64వ రాజ్యాంగ సవరణ, నగరపాలక వ్యవస్థకు 65వ రాజ్యాంగ సవరణ బిల్లుల ద్వారా రాజ్యాంగ బద్ధత కల్పించేందుకు పార్లమెంటులో వాటిని ప్రవేశపెట్టారు. లోక్‌సభలో 2/3వ వంతు మెజారిటీ పొందినప్పటికీ రాజ్యసభలో 2 ఓట్లు తగ్గడం వల్ల ఈ బిల్లులు వీగిపోయాయి.
- 1990, సెప్టెంబరు 7న వి.పి. సింగ్ ప్రభుత్వం పంచాయతీలు, పురపాలక సంఘాలకు సంబంధించి ఉమ్మడి బిల్లును 74వ రాజ్యాంగ సవరణ బిల్లుగా లోక్‌సభలో ప్రవేశపెట్టింది. అయితే వి.పి. సింగ్ ప్రభుత్వం అవిశ్వాస తీర్మానం ద్వారా రద్దవడంతో ఈ బిల్లు చర్చకు నోచుకోలేదు.
- పి.వి. నరసింహారావు ఆధ్వర్యంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 1991, సెప్టెంబరు 16న పంచాయతీలు, మున్సిపాలిటీలకు (పురపాలక) సంబంధించిన బిల్లులను వేర్వేరుగా పార్లమెంటులో ప్రవేశపెట్టింది.
- ఈ బిల్లులను పార్లమెంటరీ కమిటీకి నివేదించగా వాటిని 1992, డిసెంబరు 22న లోక్‌సభ, డిసెంబరు 23న రాజ్యసభ, 17 మెజారిటీ రాష్ట్ర శాసనసభలు ఆమోదించాయి.
- భారత రాష్ట్రపతి డాక్టర్ శంకర్ దయాళ్ శర్మ 1993, ఏప్రిల్ 20న బిల్లులపై సంతకం చేశారు. దీంతో 73, 74వ రాజ్యాంగ సవరణ బిల్లులకు రాజ్యాంగ ప్రతిపత్తి లభించింది.
- పంచాయతీరాజ్ సంస్థలకు సంబంధించిన 73వ రాజ్యాంగ సవరణ 1993, ఏప్రిల్ 24న అమల్లోకి వచ్చింది. ప్రతి ఏటా ఏప్రిల్ 24న పంచాయతీరాజ్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.
- పట్టణ మున్సిపాలిటీలకు సంబంధించిన 74వ రాజ్యాంగ సవరణ 1993, జూన్ 1న అమల్లోకి వచ్చింది.
- 73వ రాజ్యాంగ సవరణ చట్టం 1992లో అమల్లోకి వచ్చిన తర్వాత 1993, మే 10న కర్ణాటకలో మొదటిసారిగా పంచాయతీరాజ్‌ను అమలు చేశారు. పంచాయతీలకు తొలిసారిగా ఎన్నికలు నిర్వహించిన రాష్ట్రం కర్ణాటక.
- 73వ రాజ్యాంగ సవరణ చట్టానికి అనుగుణంగా నూతన పంచాయతీ వ్యవస్థ నిర్మాణం 20 లక్షల కంటే తక్కువ జనాభా ఉన్న రాష్ట్రాలకు వర్తించదు. అవి:

  1) జమ్మూకశ్మీర్

  2) దిల్లీ

  3) నాగాలాండ్

  4) మేఘాలయ

  5) మిజోరాం

  6) పశ్చిమ్ బంగలోని డార్జిలింగ్

  7) అరుణాచల్‌ప్రదేశ్‌కు మూడంచెల విధానం వర్తించదు

### ప్రకరణ 243: నిర్వచనాలు

- ప్రకరణ 243లో కొన్ని పదాలకు నిర్వచనాలను కింది విధంగా పేర్కొన్నారు.



R-18-9-18

**జిల్లా:** ఒక రాష్ట్రంలోని జిల్లా అని అర్థం.

**గ్రామసభ:** గ్రామస్థాయిలో పంచాయతీ పరిధిలోని ఓటర్ల జాబితాలో రిజిస్టర్ అయిన వ్యక్తుల సమూహాన్ని గ్రామసభ అంటారు.

**మాధ్యమిక స్థాయి:** జిల్లాకి, గ్రామస్థాయికి మధ్య ఉన్న స్థాయినే మాధ్యమిక స్థాయి అంటారు. ఒక విభాగానికి సంబంధించి దేన్ని మాధ్యమిక స్థాయిగా పరిగణించాలో గవర్నర్ పబ్లిక్ నోటిఫికేషన్ ద్వారా నోటిఫై చేస్తారు.

పంచాయతీ అంటే గ్రామీణ ప్రాంతాల్లో 243B ప్రకరణ కింద ఏర్పాటైన స్థానిక స్వపరిపాలన సంస్థ.

**పంచాయతీ ఏరియా:** ఒక పంచాయతీ ప్రాదేశిక ప్రాంతం.

**జనాభా:** చివరిగా జనాభా లెక్కల సేకరణ జరిగి ప్రచురించిన జాబితాలో ఉన్నవారు అని అర్థం.

**గ్రామం:** గవర్నర్ నోటిఫై చేసిన ప్రాంతం. అనేక గ్రామాలను కలిపి గ్రామంగా నోటిఫై చేయవచ్చు.

ప్రకరణ **243A:**

**గ్రామసభ:** గ్రామ స్థాయిలో గ్రామసభలను, అధికార బాధ్యతలను శాసనసభ నిర్దేశించిన విధంగా నిర్వహిస్తుంది. ప్రతి గ్రామానికి ఒక గ్రామసభ ఉంటుంది. గ్రామంలోని ఓటర్లు గ్రామసభ సభ్యులు. దీన్ని సంవత్సరానికి రెండుసార్లు ఏర్పాటు చేయాలి. ప్రస్తుతం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో నాలుగు సార్లు సమావేశపరుస్తున్నారు.

✪ 2018 తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం ప్రకారం సంవత్సరానికి ఆరుసార్లు (2 నెలలకు ఒకసారి) ఏర్పాటు చేస్తున్నారు.

ప్రకరణ **243B:** మూడంచెల పంచాయతీ వ్యవస్థ ఏర్పాటు

ఎ) కింది స్థాయిలో – గ్రామ పంచాయతీ

బి) మధ్యస్థ స్థాయిలో – పంచాయతీ సమితి

సి) పై స్థాయిలో – జిల్లా పరిషత్

**243 B(2) –** ఒక రాష్ట్ర జనాభా 20 లక్షల కంటే తక్కువ ఉంటే మూడంచెల పంచాయతీ వ్యవస్థ అవసరం లేదు. గోవా, సిక్కిం, మణిపూర్, పుదుచ్చేరి, లక్షద్వీప్, దాద్రానగర్ హవేలి, డామన్ డయ్యూ ప్రాంతాల్లో రెండంచెల పంచాయతీ వ్యవస్థ విధానం అమల్లో ఉంది.

✪ జమ్మూకశ్మీర్‌లో ప్రత్యేక చట్టం ద్వారా ఒక అంచె విధానాన్ని అమలు చేస్తున్నారు.

ప్రకరణ **243C:** ఇది పంచాయతీల నిర్మాణం, ఎన్నికల నిర్వహణ గురించి తెలియజేస్తుంది.

✪ స్థానిక ప్రభుత్వాలు ప్రత్యక్ష, పరోక్ష ఎన్నిక పద్ధతిని అమలు చేస్తున్నాయి. అదే విధంగా కొంతమంది కోఆప్ట్ సభ్యులను కూడా నియమిస్తారు.

ఎ) **ప్రత్యక్షంగా ఎన్నికయ్యే వారు:** వార్డు సభ్యులు, సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు.

బి) **పరోక్షంగా ఎన్నికయ్యేవారు:** ఉపసర్పంచ్, మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్, ఎంపీపీ, జడ్పీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్, మేయర్, డిప్యూటీ మేయర్.

సి) **కోఆప్ట్ సభ్యులు:** ప్రతి అంచెలో ఆయా సభ సభ్యులు కోఆప్ట్ సభ్యులను ఎన్నుకుంటారు. వీరు మైనారిటీ వర్గానికి చెందిన వారై ఉంటారు.

ప్రకరణ **243D:** పంచాయతీలో రిజర్వేషన్లు

✪ రాష్ట్ర శాసనసభ నిర్ణయించిన ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు జనాభా రిజర్వేషన్లు ఉంటాయి. ఇవి 202c వరకు అమల్లో ఉంటాయి.

✪ వెనుకబడిన తరగతుల రిజర్వేషన్‌లను రాష్ట్ర ప్రభుత్వ విచక్షణకు అప్పగించారు.

✪ 1/3వ వంతు స్థానాలను మహిళలకు కేటాయించి, వీటిలో ఎస్సీ, ఎస్టీలకు కేటగిరి ప్రకారం 1/3వ వంతు స్థానాలు రిజర్వు చేశారు.

✪ యూపీఏ ప్రభుత్వం 2009, నవంబరు 26న మహిళలకు 50% రిజర్వేషన్లు కల్పించే 110వ రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టింది.

✪ మహిళలకు 50% సీట్లను రిజర్వ్ చేసిన మొదటి రాష్ట్రం బిహార్, రెండో రాష్ట్రం – మధ్యప్రదేశ్.

- ✪ ప్రస్తుతం 10 రాష్ట్రాల్లో పంచాయతీరాజ్ సంస్థల్లో మహిళలకు 50% రిజర్వేషన్‌లు కల్పిస్తున్నారు.

  **అవి:** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, బిహార్, గుజరాత్, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్, రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్, ఝార్ఖండ్.

ప్రకరణ **243E:** పంచాయతీల పదవీకాలం

- ✪ స్థానిక సంస్థల పదవీ కాలం 5 సంవత్సరాలు. తప్పనిసరి పరిస్థితుల్లో పదవీ కాలం పూర్తి కాకముందే పంచాయతీలను రద్దు చేయవచ్చు. ఒకవేళ మధ్యలో రద్దయితే తిరిగి ఆరు నెలల్లోపు ఎన్నికలను నిర్వహించాలి. మిగిలిన కాలం ఆరు నెలల కంటే తక్కువ ఉంటే ఉపఎన్నిక అవసరం ఉండదు. కానీ సర్పంచ్ పదవి ఖాళీ అయితే 4 నెలల్లో, వార్డు సభ్యుల పదవి ఖాళీ అయితే 3 నెలల్లో ఎన్నికలు నిర్వహించాలి.
- ✪ ఏదైనా సీటు విషయంలో 6 నెలల కాలపరిమితి వర్తిస్తుంది. ఉపసర్పంచ్ పదవి ఖాళీ అయితే ఒక నెలలోపు ఎన్నుకోవాలి.

## స్థానిక స్వపరిపాలన సంస్థలు - స్థాయిలు

1) గ్రామీణ ప్రభుత్వాలు (పంచాయతీరాజ్ సంస్థలు) – 73వ రాజ్యాంగ సవరణ – 1992.

2) పట్టణ సంస్థలు (నగరపాలక సంస్థలు) – 74వ రాజ్యాంగ సవరణ, 1992.

3) 73వ రాజ్యాంగ సవరణ చట్టం – 1992, నూతన పంచాయతీరాజ్ వ్యవస్థకు సంబంధించిన ప్రకరణలు

- ✪ 73వ రాజ్యాంగ సవరణ చట్టం – 1992ను రాజ్యాంగంలోని IXవ భాగంలో XIవ షెడ్యూల్ 243(A) – 243(O) వరకు 16 ప్రకరణలతో పొందుపరిచారు.
- ✪ 73వ రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయతీరాజ్ సంస్థలకు 29 అధికారాలను కేటాయించారు.

## గత పరీక్షల్లో అడిగిన ప్రశ్నలు

**1.** స్త్రీలకు పంచాయతీల్లో ఎంత శాతం రిజర్వేషన్ కల్పించారు? (వీఆర్‌ఓ – 2012)

1) 1/2వ వంతు 2) 1/3వ వంతు
3) 2/3వ వంతు 4) 1/4వ వంతు

**2.** ఏ భారత రాజ్యాంగ సవరణ పంచాయతీరాజ్ సంస్థలకు రాజ్యాంగ హోదా కల్పించింది? (వీఆర్‌ఓ – 2014)

1) 71వ 2) 72వ 3) 73వ 4) 74వ

**3.** భారత రాజ్యాంగంలో 11వ షెడ్యూల్ ప్రకారం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఎన్ని కార్యాత్మక విధులు ఉంటాయి? (వీఆర్‌ఏ – 2014)

1) 27 2) 28 3) 29 4) 30

**4.** గ్రామ పంచాయతీల గురించి రాజ్యాంగంలోని ఏ ఆర్టికల్‌లో ప్రస్తావించారు? (వీఆర్‌ఏ – 2012)

1) 39వ 2) 42వ 3) 40వ 4) 41వ

**5.** భారతదేశంలో ఎన్ని రకాల స్థానిక ప్రభుత్వాలు ఉన్నాయి? (వీఆర్‌ఏ – 2012)

1) 8 2) 9 3) 3 4) 4

**6.** పంచాయతీరాజ్ సంస్థలను ఎవరు ఏర్పాటు చేస్తారు? (వీఆర్‌ఏ – 2012)

1) జిల్లా కలెక్టర్ 2) లోక్‌సభ
3) రాష్ట్ర శాసనసభ 4) తహసీల్దారు

**7.** 73వ రాజ్యాంగ సవరణ దేనికి సంబంధించింది? (గ్రూప్ – IV, 1996)

1) పంచాయతీలు 2) మున్సిపాలిటీలు
3) రాష్ట్ర ప్రభుత్వ అధికారాలు 4) ఎన్నికల సంఘం

**8.** నగరపాలక బిల్లును మొదటిసారిగా ఎవరి హయాంలో ప్రవేశపెట్టారు? (జూనియర్ డ్రగ్ కంట్రోలర్ – 2011)

1) రాజీవ్ గాంధీ 2) వి.పి. సింగ్

3) చంద్రశేఖర్ 4) పి.వి. నరసింహారావు

**9.** 73వ రాజ్యాంగ సవరణ ప్రకారం పంచాయతీల కాలవ్యవధి ఎంత? (ఆంధ్రప్రదేశ్ పంచాయతీ సెక్రటరీ – 2017 గ్రూప్ – III)

1) 4 ఏళ్లు 2) 3 ఏళ్లు 3) 6 ఏళ్లు 4) 5 ఏళ్లు

**10.** స్వతంత్ర భారతంలో మొదటి పంచాయతీ? (ఆంధ్రప్రదేశ్ పంచాయతీ సెక్రటరీ – 2017 గ్రూప్ – III)

1) శంషాబాద్: ఆంధ్రప్రదేశ్ (ఇప్పుడు తెలంగాణ)

2) నాగౌర్: రాజస్థాన్

3) జేగురుపాడు: ఆంధ్రప్రదేశ్

4) బార్మర్: రాజస్థాన్

**సమాధానాలు**

1-1; 2-3; 3-3; 4-3; 5-3; 6-3; 7-1; 8-1 9-4; 10-2.

**రచయిత: అయితరాజు లక్ష్మణ్**

www.eenadupratibha.net